DD9 వార్త
తెలుగు దినపత్రిక
శుక్రవారం 01-05-2026

## మహిళా సాధికారతే లక్ష్యం

- మహిళల ఆర్థిక ఎదుగుదలకు స్వయం సహాయక సంఘాలు కీలకం
- వాటి బలోపేతానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి
- జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి



7

# నేడే మేడే


## దేశ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే పునాది

- దేశవ్యాప్తంగా కార్మికుల దినోత్సవ వేడుకలు
- 8 గంటల పని దినం కోసం చారిత్రాత్మక పోరాటం
- అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు
- పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో కార్మికులపై భారాలు
- కనీస వేతనాలు, భద్రతపై ఇంకా అనిశ్చితి

2

హైదరాబాద్, మే 1 (డిడి9 వార్త)

ప్రపంచ కార్మికుల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మేడే సందర్భంగా దేశవ్యాప్తంగా కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రమకు గౌరవం, హక్కులకు రక్షణ అనే లక్ష్యాలతో ప్రారంభమైన ఈ ఉద్యమం నేటికీ ప్రాధాన్యత కోల్పోలేదు. దేశ ఆర్థిక వ్యవస్థకు అండగా నిలిచే కార్మికుల పాత్ర అమూల్యమని నిపుణులు పేర్కొంటున్నారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేపట్టిన పోరాటం మేడేకు పునాది వేసింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది మే 1న ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కుల సాధనకు సంకేతంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



## ఆర్టీసీ బస్సుల కోసం మండుటెండలో పడిగాపులు



8

- ఉన్న బస్ షెల్టర్లను తొలగించారు
- ప్రయాణికులకు ఇబ్బందులు తెచ్చిపెట్టారు
- వాణిజ్య దందాకు తెరలేపారా అని ఆరోపించిన
- ది'సిటిజన్స్ కౌన్సిల్'స్థాపక చైర్మన్ సీతారాం ధూళిపాళ

## "బాల్య వివాహాలు, డ్రగ్స్ మరియు సైబర్ నేరాలపై అవగాహన"



3

- "గ్రామ ప్రజలకు హెల్ప్ లైన్ నంబర్లపై అవగాహన"
- "యువతలో చెడు అలవాట్ల నివారణపై చైతన్యం"

# నేడే మేడే

## దేశ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే పునాది

ప్రపంచ కార్మికుల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మేడే సందర్భంగా దేశవ్యాప్తంగా కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రమకు గౌరవం, హక్కులకు రక్షణ అనే లక్ష్యాలతో ప్రారంభమైన ఈ ఉద్యమం నేటికీ ప్రాధాన్యత కోల్పోలేదు. దేశ ఆర్థిక వ్యవస్థకు అండగా నిలిచే కార్మికుల పాత్ర అమూల్యమని నిపుణులు పేర్కొంటున్నారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేపట్టిన పోరాటం మేడేకు పునాది వేసింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది మే 1న ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కుల సాధనకు సంకేతంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



- దేశవ్యాప్తంగా కార్మికుల దినోత్సవ వేడుకలు
- 8 గంటల పని దినం కోసం చారిత్రాత్మక పోరాటం

హైదరాబాద్, మే 1 (డిడి9 వార్త)

రాష్ట్రంలో నిర్మాణ కార్మికులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, రవాణా, వ్యవసాయ రంగాల్లో పనిచేసే లక్షలాది మంది శ్రమతో అభివృద్ధి చక్రం తిరుగుతోంది. అయితే పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తగిన వేతనాల లేమి, సామాజిక భద్రత కొరత వంటి సమస్యలు కార్మికులను ఇంకా వెంటాడుతున్నాయి. ప్రత్యేకించి అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు కనీస వేతనాలు, ఆరోగ్య భద్రత, పింఛన్ వంటి హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. గిగ్ ఎకానమీ, కాంట్రాక్ట్ విధానం పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల భద్రతపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు. మేడే సందేశం కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటించాలి. శ్రమకు తగిన ప్రతిఫలం, పని ప్రదేశాల్లో భద్రత, సామాజిక రక్షణ కల్పించడం ద్వారా మాత్రమే సమాజం సమతుల్య అభివృద్ధిని సాధించగలదు. కార్మికుడి చెమటతోనే దేశం ముందుకు సాగుతుంది. వారి శ్రమకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# పాంచజన్యంతో కవిత పార్టీ ప్రకటనతో

# కాంగ్రెస్ కి జ్వరం పట్టుకుంది

నలమాస

- ఫామ్ హౌస్ కే పరిమితమైన కెసిఆర్ ను ప్రశ్నించడం తప్పా -రూప్ సింగ్
- పార్టీ పెట్టి వారం కాలేదు మూడు పార్టీల మూకుమ్మడి దాడి
- చిలక ప్రవీణ్



బంజారాహిల్స్,మే1(డిడి9 వార్త)

“పాంచజన్యం తో కవిత పార్టీ ప్రకటించగానే కాంగ్రెస్‌కు జ్వరం పట్టుకుంది” అని తెలంగాణ రాష్ట్ర సేన( టీఆర్ఎస్ ) నాయకులు నలమాస శ్రీకాంత్ గౌడ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గురువారం బంజారాహిల్స్ లోని టిఆర్ఎస్ కార్యాలయం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు,టిఆర్ఎస్ కొత్త పార్టీ ఆవిర్భావంతో రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు మొదలయ్యాయని, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఆందోళనకు గురవుతున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా మరో రాష్ట్ర నాయకులు రూప్ సింగ్ మాట్లాడుతూ, ఫామ్ హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌ను ప్రశ్నించడం తప్పా అని నిలదీశారు. ప్రజల సమస్యలపై మాట్లాడిన కవితను టార్గెట్ చేయడం సరైంది కాదని అన్నారు. బాధ్యత మరిచిన నాయకత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమని పేర్కొన్నారు.

చిలుక ప్రవీణ్ మాట్లాడుతూ, పార్టీ ఏర్పాటు చేసి వారం రోజులు కూడా గడవకముందే మూడు ప్రధాన పార్టీలు కలిసి కవితపై దాడి చేయడం వెనుక రాజకీయ భయం ఉందన్నారు. రాష్ట్రంలో బలమైన మహిళా నాయకత్వం ఎదగకుండా చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

టీఆర్ఎస్ నాయకులు లోక్ రవిచంద్ర మరింతగా మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత విమర్శలకు దిగడం దురదృష్టకరమని అన్నారు. కవిత ఎత్తి చూపిన అంశాలపై స్పందించకుండా ఆమెను బద్నాం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

ప్రజల సమస్యలపై దృష్టి సారించి పరిపాలన మెరుగుపర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కవిత పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోందని, రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

# "బాల్య వివాహాలు, డ్రగ్స్ మరియు సైబర్ నేరాలపై అవగాహన"

- **"గ్రామ ప్రజలకు హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన"**
- **"యువతలో చెడు అలవాట్ల నివారణపై చైతన్యం"**
- **"సామాజిక సమస్యలపై గ్రామంలో అవగాహన కార్యక్రమం"**



**డి డి 9 వార్త, ములుగు :**

మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం - ములుగు వారి అధ్యక్షతన, పోలీస్ శాఖ సహకారంతో, గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో మల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువత, కిశోర బాలికలు పాల్గొని వివిధ సామాజిక సమస్యలపై అవగాహన పొందారు.

ఈ కార్యక్రమంలో టీనేజ్ గర్భధారణ, ఎలోప్మెంట్, బాల్య వివాహాల నివారణ, బాల కార్మికత్వం, విద్య ప్రాముఖ్యత, మత్తు పదార్థాల నివారణ మరియు సైబర్ నేరాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (CDPO), సబ్ ఇన్‌స్పెక్టర్ (SI), జిల్లా బాలల సంరక్షణ అధికారి (DCPO) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ గారు దైవ దర్శనానికి వెళ్లిన కారణంగా హాజరుకాలేకపోయారు. వారి స్థానంలో ఉప సర్పంచ్ గారు మరియు పంచాయతీ కార్యదర్శి గారు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన CDPO గారు బాల్య వివాహాల దుష్పరిణామాలు, టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు మరియు బాలికల విద్య ప్రాముఖ్యతపై వివరించారు. పిల్లల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాలల అభివృద్ధి, పోషణ, బాల కార్మికత్వం నివారణ మరియు పిల్లల సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రతి పిల్లవాడు పాఠశాలకు వెళ్లేలా చూడాలని సూచించారు.

SI గారు ఎలోప్మెంట్, సైబర్ నేరాలు మరియు మత్తు పదార్థాల ప్రమాదాలపై ప్రజలకు ముఖ్యంగా డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాల గురించి తల్లిదండ్రులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. డ్రగ్స్ వాడడం వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బతినడం, చదువు మధ్యలో ఆగిపోవడం, చెడు అలవాట్లకు లోనవడం మరియు భవిష్యత్తు నాశనం కావడం వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించిన వెంటనే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

DCPO గారు బాలల హక్కులు, రక్షణ చట్టాలు మరియు అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సేవల గురించి వివరించారు. పిల్లలపై ఏవైనా అన్యాయం జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఉప సర్పంచ్ గారు గ్రామంలో బాల్య వివాహాలు, బాల కార్మికత్వం వంటి సమస్యలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థులు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారా మాత్రమే పిల్లల భవిష్యత్తు వెలుగొందుతుందని చెప్పారు. అదనంగా, జిల్లా పౌర సంబంధాల శాఖ సాంస్కృతిక సారథి రావుల శంకర్ కళాబృందం బాల్య వివాహం, బాలల హక్కులు మరియు మత్తు మందుల నివారణ అంశాలపై పాటలు, నాటికల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ప్రజలకు ముఖ్యమైన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లు తెలియజేశారు:

చైల్డ్ హెల్ప్ లైన్ - 1098, పోలీస్ - 100, మహిళా హెల్ప్ లైన్ - 181, సైబర్ క్రైమ్ - 1930.

ఈ అవగాహన కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో సామాజిక బాధ్యత, చట్టాలపై అవగాహన మరియు పిల్లల రక్షణపై చైతన్యం పెంపొందించబడింది.

కార్యక్రమంలో DCPU టీమ్ సభ్యులు జ్యోతి, సంధ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామస్థులు, యువత, కిశోర బాలికలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బాధపడుతున్న ప్రతి ఇంటికి బాసటగా బీఆర్ఎస్ నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్

- **నియోజకవర్గంలో ప్రతినిత్యం సేవా కార్యక్రమాలు.**
- **అనారోగ్యంతో బాధపడుతున్న లారీ డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకున్న బీఆర్ఎస్ నేత వ్యాల్ల హరీష్ రెడ్డి.**

**డిడి9వార్త / రామగుండం మే 1:**

గోదావరిఖని: గోదావరిఖని పవర్ హౌస్ కాలనీకి చెందిన మహమ్మద్ రహీముద్దీన్ గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యాడు. లారీ డ్రైవర్ గా పనిచేసే రహీముద్దీన్ రెక్కడితే గానీ పూట గడవని పరిస్థితి ఉంది. ఓవైపు కుటుంబ భారం, మరోవైపు అనారోగ్య సమస్యలు ఆర్థికంగా రహీముద్దీన్ కుటుంబాన్ని కుంగ దీశాయి. మనోధర్యం కోల్పోయిన రహీముద్దీన్ దీన గాధను తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి పార్టీ శ్రేణులతో గురువారం పవర్ హౌస్ కాలనీలోని రహీముద్దీన్ ఇంటికి వెళ్లారు. కంటి నిండా దుఃఖంతో ఉన్న రహీముద్దీన్ కు బాసటగా ఉంటానని ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చులకోసం పదివేల ఆర్థిక సహాయాన్ని అందించి మనోధైర్యాన్ని కల్పించారు. మాటలతో కాకుండా చేతలతో తన వంతు సహకారాన్ని అందిస్తూ హరీష్ రెడ్డి తనకంటూ



ఓ ప్రత్యేకతను సాధిస్తున్నారు. ఇదే క్రమంలో వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు, అనాథలకు తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు. తనకు ఉన్న దాంట్లో నలుగురికి పంచడమే భాగ్యం అంటూ ప్రజాసేవలో ప్రత్యేక మార్కు సాధిస్తున్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో బాధతప్త కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈరోజు జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పొలాడి శ్రీనివాస రావు, బూరుగు వంశీకృష్ణ, నడిపెల్లి సాయి, నూతి రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# ఆదివాసీ సంప్రదాయాలతో ITDA పి.ఓ కి ఘన సత్కారం

**మంగపేట ఏప్రిల్ 30డీడీ 9 వార్త**

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి “తుడుందెబ్బ” బృందం ITDA పి.ఓ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు పోడెం బాబు, ములుగు జిల్లా అధ్యక్షులు, కన్నాయిగూడెం మండల అధ్యక్షులు గుండ్ల పాపారావు తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు జరిపారు. ఆదివాసీల సంక్షేమం కోసం అధికారులు మరింత దృష్టి సారించాలని నాయకులు కోరారు. ఈ సమావేశం ఆదివాసీ సంప్రదాయాల ప్రతిబింబంగా, పరస్పర గౌరవంతో సాఫీగా కొనసాగింది.





# బచ్చన్నపేటలో హెచ్‌పీ పెట్రోల్ బంక్‌పై అకస్మిక తనిఖీ

**జనగామ ఏప్రిల్ 30(డిడి 9వార్త) బ్యూరో**

బచ్చన్నపేట మండలం చిన్నరామంచర్ల గ్రామంలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకును కలెక్టర్ సందీప్ కుమార్ ర్యా అకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ నాణ్యతను రీజిస్ట్రార్ సమక్షంలో పరిశీలించారు.

నిల్వలు సక్రమంగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు, ఎటువంటి నిర్లక్ష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సీసీటీవీ ఫుటేజీని నిరంతరం భద్రపరచాలని, అగ్ని ప్రమాద నివారణకు అవసరమైన పరికరాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

పెట్రోల్ బంక్ నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.





# శ్రీ మల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నాలుగవ రోజు పూజలు

**మంగపేట ఏప్రిల్ 30డీడీ 9వార్త**

శ్రీ హేమాచల లక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానం, మల్లూరు లో 27042026 నుండి 06062026 వరకు వైభవంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.

30042026 గురువారం ఉదయం 8 గంటలకు రమా సత్యనారాయణ స్వామి స్నపనం, చతుస్థానార్చన భక్తిశ్రద్ధలతో జరిగాయి. అనంతరం సుదర్శన హోమం విశేషంగా నిర్వహించబడింది. ఈ పూజా కార్యక్రమాలను భద్రాచలం సీతా రామ చంద్ర స్వామి వారి దేవస్థానం కు చెందిన అర్చకులు అమరవాది మూరళీకృష్ణమాచార్యుల బృందం వైదిక విధానంలో నిర్వహించారు.

సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు ఎదుర్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. వీరస్వామి , దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు, కురవి దేవస్థానం ఈఓ శ్రావణపు సత్య నారాయణ , ములుగు ఆర్డీవో, ఎంఆర్వో, ఎస్సై పాల్గొన్నారు.

అలాగే దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్ , కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మొక్కజొన్నలో అధిక దిగుబడి శ్రీరామ సీడ్స్ తోటే సాధ్యం

- **శ్రీరామ సీడ్స్ ప్రతినిధి పల్లెర్ల రవి వర్మ.**
- **శ్రీరామ సీడ్స్ ఆధ్వర్యంలో రైతు ప్రదర్శన క్షేత్రం.**

**ఏప్రిల్ 30 గుండాల (డి డి 9 వార్త).**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం జగ్గు తండా గ్రామంలో గురువారం నాడు ప్రముఖ విత్తన సంస్థ శ్రీ రామ సీడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో హైబ్రిడ్ మొక్కజొన్న పూజ 14 మెగా ఫీల్డ్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ రైతులు, సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు యువ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ సీడ్స్ ప్రతినిధి పల్లెర్ల రవి వర్మ మాట్లాడుతూ, "శ్రీ రామ సీడ్స్ సంస్థ రూపొందించిన పూజ 14 విత్తనం అధిక దిగుబడి, రోగనిరోధక శక్తి, అన్ని రకాల నేలలకు అనుకూలత కలిగిన ఉత్తమ రకం హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనం" అని తెలిపారు. ఈ విత్తనం ద్వారా రైతులు సగటున ఎకరాకు ఎక్కువ పంట దిగుబడిని సాధించి, మంచి లాభాలు పొందవచ్చని చెప్పారు. అదే విధంగా శ్రీ రామ సీడ్స్ దేశవ్యాప్తంగా రైతు ప్రయోజనాలకే ప్రధాన ప్రాధాన్యత ఇస్తోంది. పూజ 14 రకం మొక్కజొన్న విత్తనం వర్షాభావ పరిస్థితులలో కూడా నిలకడగా పెరుగుతుంది. గింజ గుణనిలువ, పిండిపదార్థం శాతం, మరియు నాణ్యత పరంగా ఈ రకం అగ్రగామి" అని వివరించారు. తదుపరి స్థానిక రైతులు ప్రాక్టికల్ ఫీల్డ్ డెమోన్స్ట్రేషన్లో పాల్గొని, పూజా 14 విత్తనాన్ని ఇతర రకాలతో పోల్చి చూసారు. రైతులు మాట్లాడుతూ, ఈ రకం పంటలో కొమ్మ బలంగా ఉండడం, పీడకుల ప్రభావం తక్కువగా ఉండడం, మరియు గింజలు గట్టి, పసుపు రంగులో మెరిసేలా ఉండడం తమను ఆకట్టుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్లు అజ్మీరా కుమార్ , చాట్ల కిరణ్ కుమార్ మరియు శ్రీరామ సీడ్స్ ప్రతినిధులు నవీన్ రామకృష్ణ మరియు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలో ప్రైవేట్ స్కూల్‌లకు ఢీటుగా ZPSS & KGBV పాలకుర్తి

**పాలకుర్తి ఏప్రిల్ 30(డిడి 9 వార్త)**

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పాలకుర్తి ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ స్కూల్‌లకు సాటిగా ప్రతిభ చాటాయి. ముఖ్యంగా ZPSS (జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్) మరియు KGBV (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు ఈ ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతున్నదనే విషయాన్ని మరోసారి రుజువు చేశాయి ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని అధికారులు తెలిపారు పాలకుర్తి ZPSS & KGBV పాఠశాలల్లో ఎక్కువ శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, పలువురు అత్యుత్తమ గ్రేడ్లు సాధించారు ZPSS పాలకుర్తి పాఠశాలలో డి. మానస 600లో 565 మార్కులు, జి. సిరిచందన 563 మార్కులు, బి. అనూష 560 మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్నారు అలాగే కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (KGBV) లో కె. పూర్ణిమ 600లో 551 మార్కులు సాధించి మెరుగైన ఫలితాన్ని నమోదు చేయడం జరిగింది ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం విశేషంగా నిలిచింది సందర్భంగా విద్యార్థులను ఆయా పాఠశాల ప్రిన్సిపాల్ టీచర్స్ స్థానిక ప్రజాప్రతినిధులు విద్యాధికారులు అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు

# టియూడబ్ల్యూజే (ఐజేయూ ) యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి

- **యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు**
- **మే 15న ములుగులో ఐజేయు యూనియన్ మహాసభ నిర్వహణ**
- **మహాసభను విజయవంతం చేయాలని పిలుపు**



**గోవిందరావుపేట, ఏప్రిల్ 30(డిడి 9 వార్త)**

టి యు డబ్ల్యూ జే (ఐ జే యూ ) యూనియన్ బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు పిలుపునిచ్చారు. గురువారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బస్సాపూర్ సమీపంలోని "విరించి " రిసార్ట్ లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండి షఫీ అహ్మద్, కార్యదర్శి చిదురాల వాసుదేవ్ ల అధ్యక్షతన యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి మండలంలో ఐజేయూ సంఘం సభ్యుల సంఖ్య ఎక్కువ మొత్తంలో ఉండే విధంగా నాయకులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. యూనియన్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ములుగు జిల్లా ముందు వరుసలో ఉండాలని పిలుపునిచ్చారు. సంఘం సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా యూనియన్ రాష్ట్ర నాయకత్వం నిరంతరం శ్రమిస్తుందని అన్నారు. మే 15న ములుగు జిల్లా కేంద్రంలో ఐజేయు మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక నాయకత్వానికి ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి సంఘం సభ్యులను అధిక సంఖ్యలో తరలించి మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇట్టి మహాసభ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర నాయకత్వం తో పాటు ప్రెస్ అకాడమీ చైర్మన్ హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఐజయు నాయకత్వం కలిసికట్టుగా మహాసభ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పలు అంశాలపై ఆయన స్థానిక యూనియన్ నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో ఐజేయు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎలగందుల కొమురయ్య జిల్లా ఉపాధ్యక్షులు భేతి సతీష్ యాదవ్. గంపల శివ సంయుక్త కార్యదర్శి చుంచు రమేష్. గూగుల మోడీ హరికృష్ణ కోశాధికారి బైకానీ నటరాజ్. దాడుల వ్యతిరేక కన్వీనర్ జాలిగం శ్రీనివాస్ చిన్న పత్రికల ప్రధాన కార్యదర్శి. ఎనుగందుల. శంకర్. జింకల ప్రభాకర్. గోల్కొండ రాజు. ముంద్రాతి ప్రతాప్. కుదురుపాక ప్రవీణ్ అశోక్.

# OHSR 60 వేల లీటర్ల మిషన్ భగీరథ నూతన వాటర్ ట్యాంక్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

- **ప్రజలందరికీ సురక్షితమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్న ఎమ్మెల్యే.**

**మణుగూరు. ఏప్రిల్ 30 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలంలోని అరుంధతి నగర్‌లో నిర్మించిన OHSR 60 వేల లీటర్ల సామర్థ్యం గల మిషన్ భగీరథ నూతన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయ్యింది. ఈ ట్యాంక్ ద్వారా సుమారు 130 కుటుంబాలకు స్వచ్ఛమైన మంచినీటి సదుపాయం కలిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగునీరు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎమ్మార్వో అద్దంకి నరేష్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఆర్ఐ గోపి, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మరియు మండల అధ్యక్షులు పీరినాకి నవీన్,



టౌన్ అధ్యక్షులు శివ సైదులు, సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య, వార్డు సభ్యులు కృష్ణవేణి, రహీం పాషా, కొల పిన్ని మానస, మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనరల్ సెక్రెటరీ పోలమూరి రాజు, ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు సామా శ్రీనివాస రెడ్డి, S గణేష్ రెడ్డి, 14 టైర్ అధ్యక్షులు దుగ్గం పూడి ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య, తిరుమలేష్, కే అప్పారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా కరీంనగర్ జిల్లా జట్టు

- **ఉత్కంఠభరిత ఫైనల్లో హకీంపేట్‌పై కరీంనగర్ విజయం**
- **అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్‌లో హకీంపేట్‌పై 1-0తో విజయం**




**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 30 (డిడి9 వార్త):**

మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ వేదికగా ఏప్రిల్ 27 నుంచి 29 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్ బుధవారం ఘనంగా ముగిసింది. డీఎఫ్ఏ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలో కరీంనగర్ జిల్లా జట్టు అద్భుత ప్రదర్శనతో ఛాంపియన్‌గా నిలిచింది.

ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు రంగారెడ్డి జిల్లాకు చెందిన హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ జట్టుతో తలపడింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో కరీంనగర్ క్రీడాకారిణులు వ్యూహాత్మకంగా ఆడి 10 గోల్ తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. హకీంపేట్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ విజయం సాధించిన కరీంనగర్ జట్టును రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డబ్ల్యూ. గణపతి, జిల్లా అధ్యక్షుడు నాయుడు, ఉపాధ్యక్షుడు డబ్ల్యూ. వెంకటరావు అభినందించారు. క్రీడాకారిణులు ప్రదర్శించిన క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ప్రశంసనీయమని తెలిపారు. జట్టును విజయపథంలో నడిపించిన హెడ్ కోచ్ డబ్ల్యూ. విజయ్, అసిస్టెంట్ కోచ్ బొంతు రేవంత్ కృషిని కొనియాడారు. క్రీడాకారిణుల కష్టపాటు, శిక్షణ వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రోత్సాహం కూడా జట్టు విజయానికి దోహదపడిందని తెలిపారు





# క్రీడలతో మానసిక ఉల్లాసం: గోల్కొండ డీసీపీ చంద్రమోహన్

- **ఎన్‌టీపీసీ రామగుండంలో క్రికెట్ మ్యాచ్ – ప్రతిభ చూపిన యువ క్రీడాకారులు**
- **అండర్-17 క్రీడాకారిణుల విజయానికి కోచ్‌కు అభినందనలు**

**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 30 (డిడి9 వార్త):**

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని గోల్కొండ డీసీపీ చంద్రమోహన్ అన్నారు. ఎన్‌టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో 22 యార్డ్స్ కోచింగ్ క్యాంపు ఆధ్వర్యంలో సిద్ధార్థ హైస్కూల్, కోచింగ్ క్యాంపు మధ్య బుధవారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., అండర్ 17 రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొన్న శరణప్రియ, స్ఫూర్తి, శ్రీ నిత్యకు శిక్షణ అందిస్తున్న కోచ్ సుదేశ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులు మంచి ప్రతిభను ప్రదర్శించారని ప్రశంసించారు.

కృష్ణవేణి పాఠశాలలో చదువుతున్న ఒజ్జ శరణప్రియ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించగా, ఆమె తల్లిదండ్రులు ఒజ్జ స్వప్న, శ్రీనివాస్ ఆనందం వ్యక్తం చేస్తూ కోచ్ సుదేశ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# మేడే హాలిడే ఇవ్వాలి...ఎన్‌టీపీసీ యాజమాన్యానికి సునీల్ డిమాండ్

- **కార్మిక హక్కులను కాపాడాలని, వెంటనే మే 1 సెలవు అమలు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్**

**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 30 (డిడి9 వార్త):**

ఎన్‌టీపీసీ కార్మికులకు మే 1న లేబర్ హాలిడే ఎందుకు వర్తించడం లేదని యాజమాన్యం సమాధానం చెప్పాలని ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ సూటిగా ప్రశ్నించారు. 1886లో పని గంటల తగ్గింపుకోసం జరిగిన పోరాటాల్లో అమరులైన కార్మిక నేతల త్యాగాలతోనే 8 గంటల పని హక్కు సాధ్యమైందని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా మే 1న కార్మికులకు లేబర్ హాలిడే అమలవుతున్నప్పటికీ, ఎన్‌టీపీసీలో అమలు కాకపోవడం అన్యాయమని అన్నారు. విభజించి పాలించే విధానాలు మానుకుని కార్మిక హక్కులకు విఘాతం కల్పించవద్దని, వెంటనే మేడే హాలిడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక సంబంధాలు దెబ్బతినకుండా యాజమాన్యం స్పందించాలని కోరారు.



ప్రపంచవ్యాప్తంగా కార్మికులు జరుపుకునే మేడే సందర్భంగా చికాగో అమరవీరుల స్ఫూర్తిని స్మరించుకుంటూ, ప్రతి కంపెనీ, కార్ఖానాల్లో ఎర్రజెండాలు ఎగురవేసి సభలు, ర్యాలీలు నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.





# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రామగుండానికి మంచి ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి: మేయర్ మహంకాళి స్వామి

- **కాలువల పూడికతీత, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌తో నగర స్వచ్ఛతకు ప్రాధాన్యం**

**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 30 (డిడి9 వార్త):**

రామగుండం నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని మేయర్ మహంకాళి స్వామి ప్రజలను కోరారు. గురువారం వార్డు సందర్శనలో భాగంగా 49వ డివిజన్ మార్కండేయ కాలనీలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ సాగి సంతోష్ రావుతో కలిసి పర్యటించారు.



ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..., ఎమ్మెల్యే సూచనల మేరకు నగరాన్ని అందంగా తీర్చిదిద్దడంలో భాగంగా స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఇంటింటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

వర్షాకాలంలో వరద ప్రభావాన్ని తగ్గించేందుకు ముందుగానే కాలువల పూడికతీత చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులకు అదనపు భారం లేకుండా మున్సిపల్ వాహనాలు, సిబ్బందినే వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. శానిటేషన్‌లో మార్పులు కనిపిస్తున్నందున స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రామగుండం ఉత్తమ ర్యాంక్ సాధించేందుకు ప్రజలు మంచి ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని కోరారు.

డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ...వర్షాకాలంలో అంటువ్యాధులు నివారించేందుకు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టడం అభినందనీయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచనల మేరకు గత నెల రోజులుగా పలు డివిజన్లలో కాలువల పూడికతీత విజయవంతంగా కొనసాగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు ఎస్ఈ గురువీర, ఈఈ పీవీ రామన్, డీఈ అఫ్తాబ్, ఏఈ మీర్, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# టీచర్లపై అడ్మిషన్ టార్గెట్ వేధింపులు ఆపాలి

- **టార్గెట్లు పూర్తి చేయకపోతే బెదిరింపులు తగవు - ఏఐఎస్ఎఫ్ రేణుకుంట్ల ప్రీతం హెచ్చరిక**



**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 30 (డిడి9 వార్త):**

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లపై అడ్మిషన్ టార్గెట్ల పేరిట వేధింపులు తక్షణమే ఆపాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., ఉపాధ్యాయులను బోధనకు బదులుగా అడ్మిషన్లు తెచ్చే పనిలో నెట్టడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమన్నారు. టార్గెట్లు పూర్తి చేయకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని, జీతాలు తగ్గిస్తామని యాజమాన్యాలు బెదిరించడం అనైతికమని విమర్శించారు. ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కాగా, వాణిజ్య ఒత్తిళ్లతో బోధనేతర పనులపై దృష్టి మళ్లించడం విద్యా వ్యవస్థకు నష్టం కలిగిస్తుందని అన్నారు. టీచర్లను మార్కెటింగ్ ప్రతినిధులుగా ఉపయోగించడం పూర్తిగా తప్పని పేర్కొన్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ఈ వేధింపులను అరికట్టాలని, టీచర్ల హక్కులను రక్షించేలా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. అలాగే ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పీఎఫ్ వంటి హక్కులు కల్పించాలన్నారు. ఇలాంటి అన్యాయాలు కొనసాగితే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# భూమి పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం: జి.ఎం. లలిత్ కుమార్

- **ఎర్త్ డే సందర్భంగా ప్రతిజ్ఞ పత్రం విడుదల – పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహణ**



**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 30 (డిడి9 వార్త):**

ధరిత్రి దినోత్సవం మరియు ‘ఎర్త్ మంత్’ సందర్భంగా భూమిని కాపాడాలనే సంకల్పంతో రూపొందించిన “భూమి పరిరక్షణ ప్రతిజ్ఞ” పత్రాన్ని సింగరేణి ఆర్జీ 1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ తన కార్యాలయంలో అధికారికంగా విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్లోబల్ వార్మింగ్, పెరుగుతున్న కాలుష్యం మానవ జీవన విధానంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యవసాయంలో అధికంగా రసాయనాల వినియోగం వల్ల భూసారం దెబ్బతింటోందని, ఇది భవిష్యత్తులో ఆహార భద్రతకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ స్పృహతో వ్యవహరించి భూమిని కాలుష్య రహితంగా ఉంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జి.ఎం. ఆదేశాల మేరకు ఏరియా ఎన్విరాన్మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆర్జీ 1లోని వోకేషనల్ ట్రైనింగ్ సెంటర్ లో భూమి పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి, ‘గ్రీన్ వారియర్’ ఎన్‌జీవో ప్రతినిధి జే.వి.ఎస్. చంద్రశేఖర్ పాల్గొని పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో వీటిసి మేనేజర్ మాధవరెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి వేణు, అధికారి వేణుగోపాల్, ఇన్స్ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఏఐటీయూసీ 3వ మహాసభలను జయప్రదం చేయాలి

- **వివిధ రంగాల కార్మికులు భారీగా హాజరుకావాలని నాయకుల పిలుపు**

**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 30 (డిడి9 వార్త):**
మే 3న ఎన్‌టీపీసీలో నిర్వహించనున్న ఏఐటీయూసీ రామగుండం నగర 3వ మహాసభలను జయప్రదం చేయాలని నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. నగర సమావేశంలో మాట్లాడిన వారు, వివిధ రంగాల కార్మికులు భారీగా హాజరుకావాలని కోరారు. ఈ మహాసభకు సిపిఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. కాంట్రాక్ట్, ఆశ, ఆర్టీసీ, భవన నిర్మాణ కార్మికులు సహా అన్ని వర్గాల వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.




# సరిహద్దుల నుంచి స్వగ్రామం దాకా... 40 ఏళ్ల దేశ సేవకు ఘన సన్మానం

- **బీఎస్ఎఫ్ రిటైర్డ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు దంపతులను సన్మానించిన :పస్రా ఎస్సై తాజుద్దీన్**

**గోవిందరావుపేట, ఏప్రిల్ 30 (డిడి 9 వార్త)**
దేశ సరిహద్దుల్లో నాలుగు దశాబ్దాలపాటు అప్రమత్తంగా విధులు నిర్వహించి, భారత భద్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన బీఎస్ఎఫ్ ఇన్స్పెక్టర్ నిడుమోలు వెంకటేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా స్వగ్రామం కోటగడ్డలో భావోద్వేగభరిత వాతావరణం నెలకొంది. గ్రామస్తులు, స్నేహితులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వెంకటేశ్వరరావుగీతాంజలి దంపతులను ఘనంగా సన్మానించారు. ఇంటర్మీడియట్ దశలో సివిక్స్ అధ్యాపకుడు నరసయ్య చెప్పిన దేశభక్తి పాఠాలు స్ఫూర్తిగా తీసుకున్న వెంకటేశ్వరరావు, డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే బీఎస్ఎఫ్‌లో చేరి దేశ సేవ మార్గాన్ని ఎంచుకున్నారు. సరిహద్దుల్లో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ 40, ఏళ్లపాటు నిర్విరామంగా సేవలందించిన ఆయన ప్రయాణం యువతకు ఆదర్శమని పస్రా ఎస్సై తాజుద్దీన్ కొనియాడారు. కోటగడ్డ గ్రామంలో గొల్యాల నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన పదవీ విరమణ సభలో ఎస్సై తాజుద్దీన్ మాట్లాడుతూ... "జవాన్లు సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడుతున్నందువల్లే మనం ప్రశాంత జీవితం గడుపుతున్నాం. దేశానికి సేవ చేసే అదృష్టం కొద్దిమందికే దక్కుతుంది. కోటగడ్డ గ్రామానికి వెంకటేశ్వరరావు రూపంలో ఆ గౌరవం దక్కడం గర్వకారణం" అన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావం పెంపొందించుకోవాలని యువతకు సూచించిన ఆయన... పదవీ విరమణ అనంతరం వెంకటేశ్వరరావు స్వగ్రామాభివృద్ధికి తన వంతు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి, పసర హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కాట్రగడ్డ సతీష్, ట్రైనీ ఎస్సై ఆంజనేయులు, ఇది నూరు వెంకట పాపిరెడ్డి, సర్పంచ్ లిల్లీ, తుమ్మల కృష్ణారెడ్డి, తుమ్మల వెంకట్ రెడ్డి, దాసరి సుధాకర్, ఉపసర్పంచ్ నిడుమోలు శ్రీనివాస్, అంతరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని సేవా యోధుడికి ఘన నివాళులు అర్పించారు.

# కార్మిక సమస్యలపై ఆర్జీ1లో సమగ్ర చర్చ

- **కార్మిక సమస్యల పరిష్కారానికి జియం లలిత్ కుమార్ హామీ**



**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 30 (డిడి9 వార్త):**
రామగుండం ఏరియా 1 జియం కార్యాలయంలో గుర్తింపు సంఘం ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులతో కలిసి జియం లలిత్ కుమార్ అధ్యక్షతన ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్మికుల సమస్యలపై చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జియం లలిత్ కుమార్ మాట్లాడుతూ..., గత సమావేశంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఇప్పటికే అమలయ్యాయని, మరికొన్ని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అన్ని సమస్యలను సానుకూల వాతావరణంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు పలు ముఖ్య సమస్యలను ప్రస్తావించారు. గనులు, కార్మిక వాడల్లో కోతులు, కుక్కల బెడద నివారణ, క్వార్టర్లలో ఫ్యాన్లు, వీధి లైట్లు ఏర్పాటు, కాలేజీ ఆవరణలో లైటింగ్, ఫ్యాన్లు ఏర్పాటు, వేసవి దృష్ట్యా కార్మికులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. అదేవిధంగా జిడికె 183 ఇంక్లైన్‌లో రెస్ట్ షెల్టర్లలో కబోర్డ్స్ ఏర్పాటు, ఓసిపి 5లో మైన్స్ కమిటీ నిర్ణయాల అమలు, వర్క్ షాప్‌లో మిషన్ల మరమ్మతులు, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఏరియా హాస్పిటల్‌లో సెక్యూరిటీ పెంపు, ప్రమాదాల్లో గాయపడిన కార్మికులకు సర్ఫేస్ పోస్టులు, రోడ్ల అభివృద్ధి, తాగునీటి సరఫరా పెంపు వంటి డిమాండ్లను వినిపించారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్ల గౌడ్, రంగు శ్రీను, అధికారులు ఆంజనేయులు, డాక్టర్ అంబిక, వరప్రసాద్, రవీందర్ రెడ్డి తదితరులు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగి రాధాకృష్ణకు ఘన వీడ్కోలు

- **సింగరేణి సేవలకు మూడు దశాబ్దాల కృషి – ఉద్యోగి, కళాకారుడు, క్రీడాకారుడిగా రాధాకృష్ణ విశిష్ట ప్రస్థానం**



**పెద్దపల్లి బ్యూరో, ఏప్రిల్ 30 (డిడి9 వార్త):**
సింగరేణిలో 35 సంవత్సరాలు సేవలందించిన ఆర్జీ3 ఓసిపి1 సి.హెచ్.పి కన్వేయర్ ఆపరేటర్ కొండ్ర రాధాకృష్ణ ఉద్యోగ విరమణ పొందగా, అధికారులు, కార్మికసంఘాల నాయకులు, సహచరులు ఘనంగా సన్మానించారు. డిజియం శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకుడు వైవి.రావు ముఖ్య అతిథులుగా హాజరై సత్కరించారు.

ఉద్యోగిగా, కళాకారుడిగా, క్రీడాకారుడిగా రాధాకృష్ణ చేసిన సేవలను కొనియాడుతూ, సింగరేణి కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లారని అభినందించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సహా పలువురు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

# ఎమ్మెల్యే పాయం ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థులు..

- **పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే..**



**మణుగూరు. ఏప్రిల్ 30 (డి డి 9వార్త)**
SSC-2026 పరీక్ష ఫలితాలలో విశిష్ట ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులు గురువారం నాడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విద్యార్థులను ఘనంగా అభినందించి, వారి భవిష్యత్తు విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు: అశ్విత - 586, త్రిశాంత్ - 578, డి.వి.ఎస్.ఎన్ రాజు - 578, జస్వంత్ - 577, షణ్ముఖ ప్రియా - 575, స్పందన - 572, ధరణి ప్రియా - 572, హంసిక్ - 571, మేఘన - 571, జీవన్ - 570 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కష్టపడి చదివే విద్యార్థులే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని అన్నారు. పట్టుదల, క్రమశిక్షణ మరియు లక్ష్యసాధన పట్ల నిబద్ధత ఉంటే విజయాన్ని సాధించడం సులభమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందిస్తున్న మార్గనిర్దేశం విద్యార్థుల విజయానికి బలమైన పునాదిగా నిలుస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ & ఎండి యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ మహమ్మద్ ఖాదర్, డైరెక్టర్ జానీ మియా ఖాన్ యాకూబ్ షరీఫ్, అశ్వాపురం ప్రిన్సిపాల్ లెనిన్ విజయ్ కుమార్, బయ్యారం ప్రిన్సిపాల్ సురేష్, నరేందర్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల విజయం పాఠశాలకు, తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు గర్వకారణమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందనలు తెలియజేశారు.

# తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రతిభా సత్కారం

**జనగామ, ఏప్రిల్ 30(డిడి 9వార్త )బ్యూరో**
జనగామ మండలం చౌడారం గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. 600లో 500కు పైగా మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే కారణమని ప్రధానోపాధ్యాయులు సుధీర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.







# నెలరోజులుగా మక్కల కొనుగోలు నిలిచిపోవడంతో రైతుల ఆందోళన – తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

- **మార్కెట్ యార్డులో ఉన్న మక్కలను వెంటనే కొనుగోలు చేయాలి**
- **కొనుగోలు ఆలస్యమైతే నిల్వ ఉన్న ధాన్యానికి ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలి**
- **వర్షా ల వల్ల నష్టం జరిగితే అధికారులే బాధ్యత వహించాలి**

**పాలకుర్తి ఏప్రిల్ 30(డిడి 9 వార్త)**

పాలకుర్తి లో గత నెల రోజులుగా చిట్యాల ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ యార్డులో మక్కల కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులు భైఠాయించి సుమారు మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ ఆదేశాల మేరకు తహసీల్దార్ సరస్వతి ఆర్ఐతో కలిసి మార్కెట్ యార్డును సందర్శించారు మార్కెట్‌లో ఉదయం 11 గంటలైనా సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు రైతులు ఏప్రిల్ 8 నుంచి మక్కల కాంటాలు వేయడం లేదని, ఇప్పటికే కాంటాలు వేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు గన్ని సంచులు, రవాణా ఖర్చులు తమే భరిస్తున్నామని తెలిపారు. త్వరలో వర్షాలు వచ్చే అవకాశం ఉండడంతో మక్కలు తడిసిపోతాయనే ఆందోళన వ్యక్తం చేశారు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజు సాంబయ్య మాట్లాడుతూ, మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న మక్కలను వెంటనే కొనుగోలు చేయాలని లేదంటే వాటికి ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు ఇప్పటికే సుమారు 77 వేల బస్తాలు కాంటాలు జరిగినప్పటికీ ఇంకా 30 వేల పైచిలుకు క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు గన్ని సంచుల కొరత గోదాముల్లో డెలివరీ సమస్యల కారణంగా కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అవుతోందని అధికారులు తెలిపినట్లు సమాచారం అలాగే కాంటాలు నమోదు కోసం రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలను తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై విచారణ చేపట్టి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సరస్వతి హామీ ఇచ్చారు



# మహిళా సాధికారతే లక్ష్యం

- **మహిళల ఆర్థిక ఎదుగుదలకు స్వయం సహాయక సంఘాలు కీలకం**
- **వాటి బలోపేతానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి**
- **జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్ ఏప్రిల్ 30 డిడి 9 వార్త**

మహిళల ఆర్థిక ఎదుగుదలకు స్వయం సహాయక సంఘాలు కీలకమని,వాటి బలోపేతానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.గురువారం ఆయన యూసీడీ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..99 డేస్ ఆఫ్ యాక్షన్ ప్లాన్'కింద ఇప్పటివరకు జోన్ పరిధిలో 195 నూతన సంఘాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.ఈ సంఖ్యను మరింత పెంచేందుకు వార్డు స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు.ప్రతి అర్హత కలిగిన కుటుంబాన్ని సంఘాల్లో భాగస్వామ్యం చేసి,వారికి ఆర్థిక సాధికారత కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో యూసీడీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పోవాలి బిఆర్ఎస్ ప్రభుత్వం రావాలి KCR ముఖ్యమంత్రి కావాలి

- **రావులపల్లి.రాంప్రసాద్ మానెరామకృష్ణ**

**ఏప్రిల్ 30 డిడి 9 వార్త దుమ్ముగూడెం**



పచ్చని తెలంగాణా రాష్ట్రంలో అబద్ధాలు చెప్పి,అమలుకు నోచుకోని వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని,రాష్ట్రప్రజలంతా రేవంత్ రెడ్డి దుర్మార్గ పాలనను ఓటు ద్వారా అంతం చేయడానికి సిద్ధంగా ఉన్నారని,మళ్ళీ ముఖ్యమంత్రిగా KCR ఉండాలని కోరుకుంటున్నారని,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేంత వరకు ప్రజల పక్షాన పోరాటాలను ఉధృతం చేస్తామని BRS పార్టీ భద్రాచలం నియోజకవర్గ నాయకులు రావులపల్లి. రాంప్రసాద్, మానె.రామకృష్ణ లు పిలుపునిచ్చారు.గురువారం లక్ష్మీ నగరం లో జరిగిన పత్రికవిలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.గ్రామ స్థాయిని BRS పార్టీ కమిటీలను ఏర్పాటు చేసుకునే దిశగా డివిజన్ స్థాయిలో ,మండల స్థాయిలో జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.ఈ క్రమంలో మే 1 వ తేదీన లక్ష్మీనగరం లో జరగనున్న BRS పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో BRS పార్టీ మండల కన్వీనర్ కణితి. రాముడు, కో కన్వీనర్ Md.జానీ పాషా,మాజీ ఎంపీపీ రేసు.లక్ష్మి, సర్పంచ్ మడకం.జోగయ్య,నాయకులు దామెర్ల. శ్రీనివాస్,మడకం. రామారావు,లంక.శివ,తంతర పల్లి.వెంకటేశ్వర్లు,రావులపల్లి. పృధ్వి,పాంద్ర.రాంబాబు,జిలకర. గంగరాజు తదితరులు పాల్గొన్నారు

# మృత్యుకుహరాన్ని తలపిస్తున్న పసర–లింగాల రహదారి

- **వీధిలైట్లు లేక చీకట్లో మట్టి కుప్పలు.. ప్రమాదాలకు ఆహ్వానం**
- **గ్రామపంచాయతీ వెంటనే చర్యలు తీసుకోవాలని వాహనదారుల విజ్ఞప్తి**



**గోవిందరావుపేట, ఏప్రిల్ 30 ( డి డి 9 వార్త ):**

పసర చౌరస్తా నుంచి మొద్దుగూడం మీదుగా లింగాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం మృత్యుకుహరాన్ని తలపిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. ఇప్పటికే వీధిలైట్లు లేక రాత్రివేళల్లో ఈ మార్గంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఘటనలు ఉన్నాయి. ఎదురెదురుగా వచ్చిన వాహనాలు ఢీకొన్న సందర్భాలు కూడా గతంలో ఎన్నో నమోదయ్యాయి.

ప్రస్తుతం వ్యవసాయ పనుల నేపథ్యంలో వరి కోత మిషన్లు, ట్రాక్టర్లు తరచూ ఈ రహదారి పై సంచరిస్తూ పంట పొలాల్లోని బురదను రోడ్డుమీదికి తీసుకువస్తుండటంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. రహదారి అంతా మట్టి, బురద కుప్పలతో నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళ చీకట్లో ఈ మట్టి కుప్పలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ యంత్రాల యజమానులు రోడ్డు భద్రతపై కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. “ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు?” అని ప్రశ్నిస్తున్నారు. పసర నుంచి లింగాల వెళ్లే ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు భయంతో వణికే పరిస్థితి నెలకొంది.

ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు, సంబంధిత శాఖలు స్పందించి రహదారిపై పేరుకుపోయిన మట్టి, బురదను వెంటనే తొలగించి వీధిలైట్ల ఏర్పాటు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత కాకుండా ముందస్తు చర్యలతో ప్రాణనష్టాన్ని నివారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎంపీ రఘురాం రెడ్డి చొరవతో 2.25 లక్షల ఎల్ఓసీ మంజూరు

- **బాధిత కుటుంబానికి అందజేసిన కాంగ్రెస్ నాయకులు**

**బోనకల్,ఏప్రిల్ 30,(డీడీ9 వార్త):**



ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అండగా నిలిచారు. బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన ఖాసీం సాహెబ్ భార్య షేక్ అమీరున్ దీర్ఘకాలిక కీళ్ళ వ్యాధితో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం సాయం చేయాల్సిందిగా ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిని గతంలో కలిసి విన్నవించుకున్నారు,వెంటనే స్పందించిన ఎంపీ సిఫారసు చేయగా నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్ )లో మెరుగైన చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి) ద్వారా రూ.2,25,000 మంజూరయ్యాయి .ఈ మంజూరు పత్రాన్ని గురువారం ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ధరావత్ రామ్మూర్తి నాయక్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, మచ్చా రామారావు,సత్య నారాయణ రెడ్డి, బోనకల్ మండల కాంగ్రెస్ నాయకులు బోయినపల్లి మురళి తదితరులు అందజేశారు.ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ప్రత్యేక చొరవ తీసుకున్న ఎంపీ రఘురాం రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## పదవి విరమణ పొందిన ఏ ఎస్ఐ నరోత్తం రెడ్డి కి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం

**గోవిందరావుపేట, ఏప్రిల్ 30 (డిడి 9 వార్త)**

పోలీస్ డిపార్ట్మెంట్లో తమ 36 సం.ల సర్వీస్ పూర్తి చేసుకుని ఈరోజు పదవీ విరమణ చేసిన పస్ర పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ నరోత్తం రెడ్డి కి జిల్లా కేంద్రం లోని పోలీస్ కార్యాలయం లో ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్, ఐపీఎస్ శాలువా కప్పి, జ్ఞాపికను బహూకరించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారుఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్, ఐపీఎస్ మాట్లాడుతూ పస్రా పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ నరోత్తం రెడ్డి గారు పోలీస్ డిపార్ట్మెంట్లో సుదీర్ఘంగా సేవలందించి సర్వీస్ పూర్తి చేసుకుని ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ విభాగంలో సుధీర్ఘ కాలంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని, పదవీ విరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించవచ్చని అన్నారు " ప్రతి ఉద్యోగికి జీవితంలో రిటైర్ మెంట్ అనేది ఒక ముఖ్య ఘట్టమని, అది వారి జీవితంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని" అని అన్నారు. విధి నిర్వహణలో పగలనక, రాత్రనక, పండగల సమయంలో భార్యా,పిల్లలకు దూరంగా ఉండి విధులు నిర్వహించినారు. పదవి విరమణ చేసిన పోలీసులు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ములుగు డి.ఎస్.పి రవీందర్, ఎస్ బి ఇన్స్పెక్టర్ శంకర్, ఆర్ఐ వెంకటనారాయణ, పస్రా ఎస్సై తాజుద్దీన్, పదవి విరమణ పొందిన నరోత్తం రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

---

## ఫిర్యాదులు ఇచ్చినా 'ఫైళ్లు'కదలవు సమాచారం ఉన్నా'కళ్లు' తెరవరు

- బుద్వేల్ అక్రమ నిర్మాణంపై అధికారుల వింత మౌనం

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 30 డిడి 9 వార్త**

"అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపుతాం, ఫిర్యాదు చేస్తే చాలు నిమిషాల్లో వాలిపోతామని ఇవి రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు తరచూ ఇచ్చే ప్రకటనలు.కానీ,బుద్వేల్ సాయికృష్ణ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణం విషయంలో మాత్రం ఈ మాటలు నీటి మూటలుగానే కనిపిస్తున్నాయి.ఇక్కడ జరుగుతున్న అక్రమంపై స్థానికులు, సామాజిక కార్యకర్తలు అధికారులకు స్పష్టమైన సమాచారం అందించినా, యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద నేపథ్యమే ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నిర్లక్ష్యమా.? కుమ్మక్కా.?**

సాయికృష్ణ కాలనీలో మట్టి కుప్పల మాటున రహస్యంగా సాగుతున్న వ్యాపార సముదాయం నిర్మాణంపై అధికారులకు సమాచారం చేరి రోజులు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు లేవు.అక్రమ నిర్మాణం జరుగుతోందని ఫోన్ల ద్వారా,ప్రత్యక్షంగా మొరపెట్టుకున్నా అధికారులు కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటి.? నిర్మాణదారుల నుంచి అందుతున్న 'అండదండల' వల్లే అధికారులు అటువైపు వెళ్లడానికి వెనకాడుతున్నారా.? అని స్థానికులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.

**చోద్యం చూస్తున్న యంత్రాంగం**

నియమ నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు జరుగుతున్నప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం ఒకసారైనా విజిట్ చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ దర్జాగా నిర్మాణా పనులు చకచక చేపడుతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అనుమతుల గురించి అడిగేవారు లేకపోవడంతో నిర్మాణదారులు మరింత రెచ్చిపోతున్నారు.

**ఉన్నతాధికారులైనా స్పందిస్తారా?**

కనీసం ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని,సమాచారం ఇచ్చినా పట్టించుకోని క్షేత్రస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. బుద్వేల్ సాయికృష్ణ కాలనీలోని ఈ అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి,నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అక్కడి నివాసితుల నుండి డిమాండ్లు వినిపిస్తున్నాయి.

---

# ముష్కిన్ చెరువులో నిర్మాణాలు వద్దు

- 10 రోజులు గడువిచ్చిన హైడ్రా అధికారులు
- తాత్కాలిక షెడ్డుల్లో ఉన్నవారితో నేరుగా చెప్పిన హైడ్రా
- ఎఫ్టీఎల్ పరిధిని పరిరక్షించేందుకు హైడ్రా చర్యలు

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 29 డిడి 9**

మీరంతా ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నారు. ఇక్కడ తాత్కాలిక షెడ్డుల్లో ఉంటున్నారు, మిమ్ములను పావులుగా వాడుకుని చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న భూములను కొట్టేయాలని కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలు,మట్టి పోసి,చెరువు స్వరూపాన్ని మార్చేసి బడా నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారు.ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను తెచ్చి చెరువు పరిధిలో వేస్తున్నారు. ఇక్కడే చెత్తను వేరు చేసి వ్యర్థాలను చెరువులోకి వదిలేస్తున్నారు.దీంతో చెరువు కలుషితమవుతోంది. ఇక్కడ ఉన్న తాత్కాలిక షెడ్డులు(నివాసాలు), దుకాణాలను పెట్టించి,వారి ఆక్రమణలను తొలగించకుండా అడ్డుగా మిమ్ములను ముందుంచుతున్నారు. చెరువు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మీరంతా ఖాళీ చేస్తే,చెరువును అభివృద్ధి చేయాలని చూస్తున్నాం. ఇక్కడ చెరువు అభివృద్ధి పనులు చేసేవారికి ఆటంకాలు కల్పించవద్దని రంగారెడ్డి జిల్లా,గండిపేట మండలం,నార్సింగి విలేజ్కు దగ్గర్లోని ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో తాత్కాలిక షెడ్డుల్లో ఉన్న వారికి హైడ్రా అధికారులు బుధవారం చెప్పారు.మీకు 10 రోజులు సమయం ఇస్తున్నాం, ప్రత్యామ్నాయం చూసుకుని చెరువు ఎఫ్టీఎల్ పరిధిని ఖాళీ చేయాలని సూచించారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య,హైడ్రా ఏసీపీ తిరుమల్,ఇరిగేషన్ శాఖ డీఈ రమాదేవితో పాటు పలువురు హైడ్రా అధికారులు, రెవెన్యూ,ఇరిగేషన్ అదికారులు అక్కడ తాత్కాలిక షెడ్డులు వేసుకుని నివాసముంటున్న వారితో మాట్లాడారు.పేదలను, అమాయకులను అడ్డంపెట్టుకుని ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని కూడా హెచ్చరించారు.ఎఫ్టీఎల్ పరిధిని ఖాళీ చేయాలని 6 నెలలుగా హెచ్చరించినా పట్టని ఆక్రమణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**52.20 ఎకరాలు ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్**

చుట్టూ వేలాది నివాసాలు లక్షలాది మంది తిరిగాడే ప్రాంతంలో ఉన్న ఒక్కగానొక్క ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధి 52.20 ఎకరాలు, చెరువును ఆక్రమించి నిర్మాణ వ్యర్థాలతో నింపేసి తాత్కాలిక షెడ్డులతో కబ్జా చేయాలనుకునే వారి కుట్రలను అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. చెరువు చెంతనే చెత్తను వేరు చేసే యూనిట్లకు అద్దెకు ఇచ్చి ముష్కిన్ చెరువును మురికి కూపంగా మార్చడాన్ని సిరియస్ గా పరిగణించింది. బడాబాబుల కబ్జాలకు కార్మికులు,సామాన్యలు బలి కావద్దు అంటూ విజ్ఞప్తి చేసింది. హెచ్ఎండీఏ నిర్ధారించిన మేరకు ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధి 52.20 ఎకరాలు,ఇందులో పయనీర్స్ సంస్థ 18 ఎకరాల వరకూ తమదంటూ వాధిస్తూ వస్తోంది. రైతులకు చెందినది 12 ఎకరాల వరకూ ఉంది. వీటికి తోడు మరో 4.20 ఎకరాలు వేర్వేరు వ్యక్తులు క్లైమ్ చేస్తున్నారు.ఇలా మొత్తం 34.20 ఎకరాలు చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోనిదే అని హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం తేలుతుంది. శిఖం సర్కారీ ల్యాండ్ 21 ఎకరాల మేర ఉంది.ఇక బఫర్ తో కలిపితే ముష్కి చెరువు 62 ఎకరాల వరకూ ఉంటుంది. గతంలో బఫర్ జోన్లో నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు కూల్చివేసిన కూడా పట్టించుకోకుండా చెరువులో మట్టిని నింపుతూ ఎఫ్టీఎల్ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టడానికి బడా నిర్మాణ సంస్థ సిద్ధమవుతుందని,వరద నీరు రాకుండా కాలువలను మూసేసి నిర్మించిన ప్రహరీని అక్కడి స్థానికులు చూపించారు.

**స్థానికుల హర్షం**

సకల జీవకోటికీ ప్రాణాధారమైన చెరువును కాపాడుతున్న హైడ్రాకు ధన్యవాదాలు.చెరువు కబ్జాల పాలవుతోందని ఫొటోలు, సాక్ష్యాలతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. మట్టి నింపుతున్న వైనాన్ని వీడియోను చూపించాం. వెంటనే హైడ్రా అధికారులు వచ్చి పరిశీలించారు.చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో బండ్ నిర్మాణం చేపడితే అడ్డుకున్నారు.ఇప్పుడు 52 ఎకరాల మేర చెరువు అభివృద్ధి జరగడానికి చర్యలు తీసుకున్నారు. హైడ్రాకు ధన్యవాదాలు.హైడ్రాను ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

---

# ఆర్టీసీ బస్సుల కోసం మండుటెండలో పడిగాపులు

- ఉన్న బస్ షెల్టర్లను తొలగించారు
- ప్రయాణికులకు ఇబ్బందులు తెచ్చిపెట్టారు
- వాణిజ్య దందాకు తెరలేపారా అని ఆరోపించిన
- ది'సిటిజన్స్ కౌన్సిల్'స్థాపక చైర్మన్ సీతారాం ధూళిపాళ

**రాజేంద్రనగర్ ఏప్రిల్ 30 డిడి 9 వార్త**

మణికొండలో సామాన్య ప్రయాణికుల కష్టాలు అరణ్య రోదనగా మారాయి.నార్సింగి సర్కిల్ మణికొండ డివిజన్ పరిధిలోని మర్రి చెట్టు జంక్షన్ నుంచి శివాలయం వరకు ప్రయాణికులకు నీడ నిచ్చే బస్ షెల్టర్లను రోడ్డు విస్తరణలో భాగంగా

మున్సిపల్ అధికారులు తొలగించడంతో,నిత్యం ప్రయాణించే వేలాది మంది ఎండలో ఎండుతూ అల్లాడిపోతున్నారు.ప్రజల సౌకర్యార్థం ఉండాల్సిన షెల్టర్ల స్థలాలు ఇప్పుడు వాణిజ్య ప్రయోజనాల కోసం దారితప్పడంపై'ది సిటిజన్స్ కౌన్సిల్'స్థాపక చైర్మన్ సీతారాం ధూళిపాళ నిప్పులు చెరిగారు.ప్రతి రోజూ ఈ మార్గంలో సుమారు 120 టీ.జీ.ఎస్.ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి.పేద, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా సాగాల్సిన ప్రజా రవాణా వ్యవస్థలో కనీస సదుపాయం లేకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందనీ,ఉన్న షెల్టర్లను పీకేసి,ఆ స్థలాలను ప్రైవేట్ వ్యక్తుల వాణిజ్య అవసరాలకు వాడుకునేలా ప్రోత్సహించడం వెనుక మర్మమేమిటని పౌర సమాజం ప్రశ్నిస్తోందనీ అన్నారు.



**ట్రాఫిక్ నరకం - భద్రత శూన్యం**

మర్రిచెట్టు వద్ద సరైన బస్ బేలు ,షెల్టర్లు లేకపోవడంతో బస్సులు రోడ్డుపైనే ఆగుతున్నాయి.దీనివల్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడటమే కాకుండా, ప్రయాణికులు ప్రాణాలకు తెగించి రోడ్డు మధ్యలో నిలబడాల్సిన పరిస్థితి దాపురించింది. తక్షణమే మున్సిపల్ ఆర్టీసీ అధికారులు స్పందించి పునర్నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

---

# గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ దివ్యౌషధం

- మండల వైద్య అధికారిణి డాక్టర్ వేముల స్రవంతి
- పాల్గొన్న గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్



**బోనకల్,ఏప్రిల్ 30,(డీడీ9 వార్త):**

గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో కీలకమని మండల వైద్య అధికారి డాక్టర్ స్రవంతి కోటిరత్నం తెలిపారు,గురువారం వారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పివి వ్యాక్సిన్ కార్యక్రమంను బానోతు జ్యోతి, సర్పంచ్,ఉప సర్పంచ్ భానోత్ కొండ తో కలసి ప్రారంభించారు. అక్కడ నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలందరూ తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలని ఆమె సూచించారు.ఈ టీకా భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడుతుందని వివరించారు.ఈ వ్యాక్సిన్‌కు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని,పూర్తిగా సురక్షితమని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. టీకా వేయించుకునే బాలికలు తప్పనిసరిగా తమ తల్లిదండ్రులను వెంట తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కావ్య,నర్సింగ్ ఆఫీసర్స్ ఉదయ్ శ్రీ,అనుష,ఫార్మసిస్ట్ రాధలత,ఏఎన్ఎం సరస్వతి,ఆశలు లీల,దుర్గ,తులసి,విజయ ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.